నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 11 మార్చి 2024 | NIZAMABAD



- కాంగ్రెస్ పార్టీని ఆడబిడ్డలే బొంద పెడతారు
- పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని కేటీఆర్ పిలుపు
- రేవంత్ మగాడైతే తక్షణం రుణమాఫీ, బోనస్ అమలుచేయాలి
- కామారెడ్డి బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి

# జైత్రయాత్రను మొదలుపెడదాం

హామీల అమలుకు కాంగ్రెస్‌ను వెంటాడుదే..

నిజామాబాద్, మార్చి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) / కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఎదురుదెబ్బను పక్కన పెట్టి పార్లమెంట్ ఎన్నికల్లో జైత్రయాత్రను మొదలుపెడదాం అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ అంతటా ప్రజల్లో తెలియని బాధ కనిపిస్తోందని చెప్పారు. చిన్నపాటి లోటుపాట్లు, పొరపాట్లతోనే బీఆర్ఎస్‌కు నష్టం వాటిల్లిందని కేటీఆర్ చెప్పారు. గెలుపోటములు శాశ్వతం కానప్పటికీ బాధ నుంచి బయటికి వచ్చి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం గులాబీ సైనికులంతా కదం తొక్కాలని పిలుపునిచ్చారు. కరెంట్ కటకట, ఎండుతున్న పొలాలతో రైతులు గోస పడుతున్నారని చెప్పారు. రైతుబంధు రాక, పొలాల పరిస్థితి తెలియక అగమ్యగోచరంగా పరిస్థితి తయారైందన్నారు. కామారెడ్డిలో నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించగా కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు మూడు గంటల పాటు సాగిన కార్యక్రమంలో ముఖ్య నేతలు కూలంకషంగా మాట్లాడారు. కేసీఆర్ ఓటమిపై గంపగోవర్ధన్ శ్రేణుల ముందే క్షమాపణలు కోరగా... ప్రతి ఒక్కరూ చక్కగా పని చేశారని కేటీఆర్ చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ అసంబద్ధ హామీలు, అబద్ధాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గందరగోళం సృష్టించాయని కేటీఆర్ వివరించారు. కామారెడ్డి నియోజకవర్గంలో గంపగోవర్ధన్ నేతృత్వంలోనే పార్లమెంట్ ఎన్నికలకు వెళ్తామంటూ పేర్కొన్నారు.

## హామీల అమలుకు వెంటాడుతాం..

రేవంత్‌రెడ్డి మగాడైతే ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించాలని కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో తాండవిస్తున్న కరువు కాలం తెచ్చింది కాదన్నారు. కాంగ్రెస్ తెచ్చిన కరువుగా అభివర్ణించారు. రోజుకు 2 టీఎంసీలు నీళ్లు కాళేశ్వరం మేడిగడ్డ వద్ద ఎత్తిపోసే వీలున్నప్పటికీ ప్రభుత్వం చేయట్లేదన్నారు. మేడిగడ్డలో 88 పిల్లర్లలో 3 పిల్లర్లు సమస్య వస్తే మూడు నెలల్లో మూడు పిల్లర్లు బాగు చేయించే వ్యవస్థ లేదా? అని ప్రశ్నించారు. మార్చి 15 వరకు ఓపిక పడతామని ఆ తర్వాత భరతం పడతాం అంటూ హెచ్చరించారు. మొన్న కేటీఆర్‌పై రేవంత్ రెడ్డి చేసిన అయ్య పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి రాలే అన్న వ్యాఖ్యలపైనా కేటీఆర్ ఘాటుగా స్పందించారు. ఎస్... నా అయ్య కేసీఆర్ అంటూ బదులిచ్చారు. రాహుల్‌గాంధీ ఎవరి పేరు చెప్పుకొని వచ్చిండని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మాట్లాడిన వేదికపైనే శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి, భట్టి విక్రమార్క ను చుట్టూ పెట్టుకొని మాట్లాడడం గొంగలిలో కూర్చుని వెంట్రుకలు ఏరినట్లు ఉందని ఎద్దేవా చేశారు. మా అయ్య పేరు కేసీఆర్. బరాబార్ వచ్చినా. ఉద్యమంలో వచ్చినా. నీ లెక్కా ఆంధ్రోళ్ల బూట్లు నాకి, దొంగ సంచులు మోసి రాలేదు. ఐదుసార్లు గెలిచినా. రాంగ్ రూట్లో రాలే. చవట పనులు చేసి, ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలకు మారి రాలేదు. ఎస్... మా అయ్య కేసీఆర్... తెలంగాణ బాపు కేసీఆర్ అంటూ బదులిచ్చారు.


సమావేశంలో పాల్గొన్న కామారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

### ఎన్నికల కోడ్‌కు ముందే జీవో జారీ చెయ్..

రేవంత్ రెడ్డికి దమ్ముంటే పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూయకముందే రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంటకు రూ.500 బోనస్ ప్రకటిస్తూ జీవోను నేడో రేపో జారీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ పేరిట రైతులను మోసం చేసేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమయ్యాడని ఆరోపించారు. పొంకనాల పోతిరెడ్డిగా రేవంత్ రెడ్డిని అభివర్ణించారు. మాటలు, అరుపుల, బొబ్బలు చూసి అందరూ రేవంత్ రెడ్డిని తిట్టుకుంటున్నారని చెప్పారు. సీఎం స్థాయిలో ఎవరైనా ఇట్లా మాట్లాడతారా అని జనాలే అంటున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ కట్టిన సచివాలయంలో కూర్చొని కేసీఆర్ ఏం చేయలేదని చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లంకె బిందెల కోసం గడ్డపారాలు, తట్టలు పట్టుకొని రాత్రిపూట వచ్చేది పచ్చి దొంగలేనని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. పేగులు మెడలో వేసుకుంటానంటూ ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి ఏమైనా బోటీ కొట్టేటోడా అని చెప్పారు. జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నానని చెప్పే ముఖ్యమంత్రికి అలా ఎవరు సంచరిస్తారో తెలియదా? అని అన్నారు. దొంగలు మాత్రమే జేబులో కత్తెరలు పెట్టుకుంటారని మండిపడ్డారు.

### గంప భావోద్వేగం...

సమావేశంలో కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ భావోద్వేగానికి గురయ్యారు. సభలో గద్గద స్వరంతో ఆయన ప్రసంగం మొదలైంది. మొదటగా కేసీఆర్ ఓటమికి క్షమాపణలు కోరారు. ఈ సందర్భంగా కన్నీళ్లు కార్చడంతో గులాబీ శ్రేణులంతా గంభీర వాతావరణంలో మునిగిపోయారు. ఓటమి ఎరుగని నేతగా గుర్తింపు పొందిన కేసీఆర్ అనూహ్యంగా కామారెడ్డిలో పరాజయం పాలవ్వడం జీర్ణించుకోలేక పోతున్నట్లుగా గంప గోవర్ధన్ వెల్లడించారు. చెమ్మగిల్లిన కళ్లతోనే గంప గోవర్ధన్ ప్రసంగాన్ని కొనసాగించారు. సమావేశంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, బీఆర్ఎస్ లీడర్లు ఎంజీ వేణుగోపాల్, నర్సింగరావు, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

### వంద రోజులు నిండినంకా వదిలేది లేదు...

గులాబీ శ్రేణులెవ్వరూ నిరాశ పడాల్సిందేమీ లేదని, ఉమ్మడి జిల్లాలో 9 సీట్లలో రెండు బాన్సువాడ, బాల్కొండ గెలిచామన్నారు. బోధన్, జుక్కల్, కామారెడ్డిలో చిన్నపాటి తేడాతోనే ఓడిపోయామని తెలిపారు. చిన్నపాటి లోటుపాట్లు, పొరపాట్లతోనే నష్టం జరిగిందని, మనకు ప్రజలు 119లో 39 సీట్లు ఇచ్చారని ఇవి తక్కువ సీట్లు కావన్నారు. రైతులంతా లోన్లు తెచ్చుకోవాలని రెచ్చగొట్టిండని డిసెంబర్ 9న రద్దు చేస్తానని తేదీలు చెప్పి ఇప్పుడు మూడు నెలలైనా రుణమాఫీ చేయకుండా రేవంత్ రెడ్డి తప్పించుకొని తిరుగుతున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ హామీలను తప్పకయాది జేస్తాం... ఇచ్చిన మాటలు నిలబెట్టుకోలేక పోతే భరతం పడతాం అంటూ హెచ్చరించారు. ఆడబిడ్డల పెండ్లికి రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని విమర్శించారు. వంద రోజులు నిండినంకా కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేది ఆడబిడ్డలేనని జోస్యం చెప్పారు. మార్చి 15కు కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల సినిమా పూర్తవుతుందని, శిశుపాలుడు వంద తప్పులు చేసేదాకా ఆగినట్లు కాంగ్రెస్ వంద రోజుల పాలన వరకు ఆగుదామన్నారు. ఆ తర్వాత విడిచి పెట్టేది ఉండదన్నారు.

### రేవంత్‌రెడ్డి మరో ఏక్‌నాథ్ షిండే అవుతాడు..



సీఎం రేవంత్‌రెడ్డి మరో ఏక్‌నాథ్ షిండే అవుతారని, తన గురువు చంద్రబాబుతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకొని మోదీ వద్దకు వెళ్లాడని, కాంగ్రెస్ నాయకులు జాగ్రత్తగా ఉండాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హితవుపలికారు. అబద్ధపు మాటలు చెప్పి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే గెలిచారని అన్నారు. నమ్మి అధికారం ఇస్తే ప్రస్తుతం ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావొస్తున్నా చేసిందేమీ లేదని, ఇప్పటి వరకు రైతు బంధు వేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసహనంతో మాట్లాడుతున్నారని, మల్కాజిగిరిలో పోటీ చేద్దామని కేటీఆర్ విసిరిన సవాల్‌కు ఇప్పటికీ నోరుమెదపలేదన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసానిచ్చారు.

### ఎంపీ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుందాం...



వచ్చే పార్లమెంట్ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకొని ముందుకు వెళ్దామని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారాలు, తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి ఫలితాలను తారుమారు చేశాయని విమర్శించారు. కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన బీజేపీ అభ్యర్థి.. ఎన్నికల సమయంలో గ్రామాల్లో గుళ్లు, గోపురాలకు విరాళాలు ఇచ్చి, ప్రజలను మభ్యపెట్టి గెలవలేదా అని ప్రశ్నించారు. మూడు నెలల నుంచి ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, లేకపోతే గ్రామగ్రామాన నిలదీస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, బీఆర్ఎస్ నేతలు తిర్మల్‌రెడ్డి, నర్సింగరావు, నిట్టు జాహ్నవి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు





### బీఆర్ఎస్ అధినేతతో.. జిల్లా నేతలు

**బీఆర్ఎస్ అధినేత** కేసీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యనేతల సమావేశంలో ఉమ్మడి జిల్లాల నేతలు పాల్గొన్నారు. కామారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు, మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ రాజు, మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, జాజాల సురేందర్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# మెట్లబావి ప్రక్షాళన

యువజన సంఘాల ఆధ్వర్యంలో శ్రమదానం

పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

రాజంపేట్, మార్చి 10: మండల కేంద్రంలోని మెట్ల బావి ప్రక్షాళనలో భాగంగాగ్రామ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేపట్టారు.బావిలో పేరుకుపోయిన మట్టిని తొలగించగా.. ఈ కార్యక్రమంలో కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పాల్గొని యువకుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాచీన కాలంలో నిర్మించిన బావి శిథిలావస్థకు చేరుకున్నదని, దాతల సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా పూడికతీత పనులు చేపట్టామని,దీంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.శ్రమదానం చేయడానికి గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో ముందుకు రావడం అభినందనీయమన్నారు.


శ్రమదానంలో పాల్గొన్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## జాతీయ పునర్నిర్మాణమే సంఘ లక్ష్యం

**నిజామాబాద్** నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ సంగమం కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సేవకులు చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– వినాయక్‌నగర్,మార్చి 10



### నిజాంసాగర్ కాలువలో గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం

చందూర్/ వర్ని, మార్చి 10 : నిజాంసాగర్ కాలువలో ఈనెల 9న వేర్వేరు ప్రాంతాల్లో పడి గల్లంతైన ముగ్గురి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. చందూర్‌కు చెందిన మొండి విష్ణువర్ధన్ (21)తోపాటు ఆఫంది ఫారానికి చెందిన మోచి విజయ్ (50), మోచి నారాయణ (20) శనివారం ప్రమాదవశాత్తు కాలువలో గల్లంతయ్యారు. ఉదయం విష్ణువర్ధన్, మోచి విజయ్ మృతదేహాలు చందూర్ లిప్టు వద్ద కెనాల్‌లో.. సాయంత్రం చందూర్‌లోని డీ-38 కాలువ వద్ద మోచి నారాయణ మృతదేహం లభ్యమయ్యాయి. రెస్క్యూటీం, పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### 120 టన్నుల రేషన్‌బియ్యం పట్టివేత

వేల్పూర్, మార్చి 10: మండల కేంద్రంలోని వజ్ర ఇండస్ట్రీ రైస్‌మిల్‌పై ఆదివారం తెల్లవారుజామున ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో వజ్ర ఇండస్ట్రీలో నిల్వ ఉంచిన 1200 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ విషయమై సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా తన సిబ్బందితో రైస్‌మిల్లును సందర్శించారు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని మాక్లూర్‌లోని సాయికృష్ణ రైస్‌మిల్‌కు తరలించారు. వజ్ర ఇండస్ట్రీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని రైస్‌మిల్ యజమాని సాయికృష్ణాగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయీస్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ దాడిలో స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు ఉన్నారు.

# ప్రత్యేక పాలన అస్తవ్యస్తం

- నిలిచిన పారిశుద్ధ్య పనులు
- నర్సరీల్లో ఎండుతున్న మొక్కలు
- స్పెషల్ ఆఫీసర్ల పాలనలో పడకేసిన గ్రామాలు

**పంచాయతీల్లో మూలనపడిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు**


నర్సరీలో ఎండుతున్న మొక్కలు


బ్రాహ్మణపల్లిలో పంచాయతీ ట్యాంకర్‌ను వినియోగించుకుంటున్న ప్రైవేటు వ్యక్తులు


బ్రాహ్మణపల్లిలో మూలనపడిన ట్రాక్టర్

నిజాంసాగర్, మార్చి 10: గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు, తాగునీరు సరఫరా చేసేందుకు, మొక్కల పెంపకం కోసం ట్యాంకర్లను కేసీఆర్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. పంచాయతీలకు ట్రాక్టర్లు వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిసింది. కేసీఆర్ సర్కారు సంకల్పం ఫలించింది. గ్రామాలన్నీ ఆదర్శంగా మారాయి. అలాంటిది ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడ చూసినా పారిశుద్ధ్యం పడకేసింది. కేసీఆర్ ప్రభుత్వం అందజేసిన ట్రాక్టర్లు మూలనపడ్డాయి. ఇందుకు నిదర్శనమే నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, బ్రాహ్మణపల్లి, ఆరెపల్లి గ్రామాలు. జీపీలకు కేటాయించిన ట్రాక్టర్ నాలుగు నెలలుగా మూలకు చేరింది. మరమ్మతుల పేరిట ట్రాక్టర్‌ను పక్కనపెట్టడంతో చెత్త సేకరించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా మురికి కాల్వల నుంచి తీసిన చెత్త 20రోజులుగా రోడ్లపైనే ఉంటున్నది. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం ట్రాక్టర్ వెళ్లకపోవడంతో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేస్తున్నారు. ట్రాక్టర్ మరమ్మతుతో ట్యాంకర్ సైతం షెడ్డుకే పరిమితమైంది. దీంతో బృహత్ పల్లెప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోతున్నాయి. బ్రాహ్మణపల్లి గ్రామంలోని ట్రాక్టర్ పరిస్థితి ఇదే విధంగా ఉన్నది. పది నెలలుగా పక్కన పెట్టారు. దీంతో ట్యాంకర్‌ను గ్రామస్తులు వినియోగిస్తుండగా, చెత్త సేకరించడం మరిచిపోయారు. ఇక ఆరేపల్లి గ్రామంలో ఆరు నెలల కిందట ట్రాక్టర్ మరమ్మతుకు గురికావడంతో అది చెట్టు కిందికి చేరింది. ట్యాంకర్‌ను ఇతరులు వినియోగించుకుంటున్నారు. గ్రామంలోని నర్సరీలో మొక్కలకు నీటిని అందించేందుకు ట్యాంకర్ లేకుండా పోయింది. నర్సరీలో ఉన్న బోరు మోట రు సైతం నెల రోజుల క్రితం పాడైపోవడంతో ఇటు ట్యాంకర్ లేక అటు మోటరు పనిచేయక నర్సరీలోని మొక్క లు ఎండిపోతున్నాయి.

### పట్టించుకోని అధికారులు..

ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు పడకేశాయి. ట్రాక్టర్లు మరమ్మతులకు గురికావడంతో వాటి గురించి పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీనికి తోడు మొక్కల పెంపకం, పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తుండడంతో గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తున్నది. ఈ విషయమై మండల పంచాయతీ అధికారి అబ్బాగౌడ్‌ను వివరణ కోరగా ట్రాక్టర్లు పాడైపోయిన విషయం ఈ రోజే తెలిసిందని, సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి వివరాలు సేకరిస్తానని దాటవేయడం గమనార్హం.